

www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
శనివారం | 29 | ఆగస్టు | 2026 | పేజీలు: 08


# తాగునీటి ఇబ్బందులుండొద్దు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల,అక్షిత బ్యూరో: ప్రజలకు త్రాగునీటి ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో అమృత్ 2.0 పథకం క్రింద కొనసాగుతున్న నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రతినిత్యం నిరంతరాయంగా త్రాగునీటిని అందించేందుకు చేపట్టిన అమృత్ 2.0 పథకంలో నీటి ..మిగతా 2లో

# నిఘా మాయం ! టిప్పర్ల రాజ్యం !!





- చెక్ పోస్ట్‌కు చెక్.. దందాకు రాదారి
- అక్రమ రవాణాకు అడ్డగా సాలూరా !
- లక్షలు దండుకుంటున్న మైనింగ్ అధికారులు
- ఇసుక దందాకు 'గ్రీన్ సిగ్నల్'.......?
- రాత్రి 8 దాటితే టిప్పర్ల పరుగులు.. సరిహద్దు దాటుతున్న ఇసుక!
- చెక్‌పోస్ట్ తొలగింపుతో ఎవరికి లాభం?
- అధికారుల మౌనం వెనుక మతలబేంటి?

నిజామాబాద్, అక్షిత ప్రతినిధి: నిఘా మాయమైంది. టిప్పర్ల రాజ్యం జోరందుకుంది. అధికారులు కాసులకు కక్కుర్తి పడి అక్రమ ఇసుక దందాను హద్దులు దాటిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాకు అడ్డగా సాలురా కేంద్రమైంది. బోధన్ పట్టణానికి కేవలం ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సాలూరా గ్రామం తెలంగాణ సరిహద్దులో చివరి గ్రామం. సాలూరా అవతల ..మిగతా 2లో







# ప్రతి తండాకు రోడ్డు

- తండాల ప్రగతే లక్ష్యం
- గిరిజన సంక్షేమానికి కృషి
- గిరిజనుల ఆత్మగౌరవం సంక్షేమానికి పెద్దపీట
- నియోజకవర్గస్థాయి గిరిజనుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

2






## ఎక్కడికక్కడ

# అక్రమ షెడ్లపై కొరడా

## సస్పెండ్ అయిన గడ్డం శీను మళ్లీ ప్రత్యక్షం

శేరిలింగంపల్లి, అక్షిత ప్రతినిధి: అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ప్రజా ప్రతినిధులు, అధికారుల అండదండలు ఉంటే అక్రమ నిర్మాణాలు చేపట్టొచ్చు. శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని సర్వేనెంబర్ 44/4 లో మియాపూర్‌లోజీహెచ్‌ఎంసీ అధికారుల కూల్చివేతలు షురూ చేశారు.శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని మియాపూర్ బీకే ఎంక్లేవ్ రోడ్డు పక్కన రెండు పెద్ద షెడ్లు నిర్మాణం జరుగుతున్నాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులకు సమాచారం ..మిగతా 2లో



www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



## తాగునీటి ఇబ్బందులుండొద్దు



**మొదటి పేజీ తరువాయి...**

ట్యాంక్ నిర్మాణం, పైప్ లైన్ల పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ, ఆసుపత్రిలోని పనులను పరిశీలించి వేగవంతం చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తరగతి గదులు, వంటశాలను పరిశీలించి వంట సిబ్బంది ఆహారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, రీ సర్వే నిర్వహణ తీరును పరిశీలించారు. ఎస్ ఐ ఆర్ నోటీసుల జారీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. భూముల రీ సర్వే లో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, అటవీ భూములు, గ్రామాల హద్దుల నిర్ధారణ సమర్థవంతంగా చేపట్టాలని, రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అనంతరం కోటపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డిలతో కలిసి ఎస్ ఐ ఆర్, భూముల రీ సర్వే ప్రక్రియ నిర్వహణపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, భూముల రీ సర్వే నిర్వహణలో అధికారులు నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని, సర్వే ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్కడికక్కడ అక్రమ షెడ్లపై కొరడా



**మొదటి పేజీ తరువాయి...**

వెళ్లిపోవడంతో అక్రమ షెడ్లను తొలగించేందుకు అధికారులు నేరుగా జెసిబి తీసుకొచ్చి షెడ్లు తొలగించడం జరిగింది. అక్రమ షెడ్లను ఎట్టి పరిస్థితుల్లో తొలగిస్తామన్న వాదనలు వినిపిస్తున్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన షెడ్లను అధికారులు శుక్రవారం రోజు డెమాలిషన్ యంత్రాలతో కూల్చివేశారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు, నిబంధనల ఉల్లంఘనలను పరిశీలించిన అనంతరం అధికారులు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిసింది. ఇటీవల కొన్ని పత్రికలలో చందానగర్ జిహెచ్ఎంసి లో కంప్యూటర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తూ, ఇతనిపై పలు ఫిర్యాదులు ఉన్న విషయాన్ని తెలుసుకున్న అధికారులు సస్పెండ్ చేసినట్లు, వాళ్లు ప్రింట్ మీడియాలలో వార్తలు ప్రచురితమై వారం గడవకముందే మళ్లీ గడ్డం శీను కూల్చివేతల దగ్గర దర్శనం కావడం చాలా మంది జీర్ణించుకోలేక పోతున్నారు.

# నిఘా మాయం ! టిప్పర్ల రాజ్యం !!

**మొదటి పేజీ తరువాయి...**

మహారాష్ట్ర పరిధిలోని యేస్గి గ్రామం ఉంది. రెండు రాష్ట్రాల సరిహద్దుగా ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు ఇసుక అక్రమ రవాణాకు అడ్డాగా మారుతోందనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. స్థానికుల ఆరోపణల ప్రకారం.. ప్రతిరోజూ రాత్రి 8 గంటల తర్వాత భారీ టిప్పర్లలో మహారాష్ట్ర వైపు నుంచి ఇసుక తెలంగాణలోకి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. వరుసగా భారీ వాహనాలు రాకపోకలు సాగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదన్నది ఇప్పుడు అసలు ప్రశ్న.






**చెక్‌పోస్ట్ ఉందా? లేక పేరుకు మాత్రమేనా?**

సరిహద్దులో అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్దే ఇసుక టిప్పర్లు స్వేచ్ఛగా తిరుగుతున్నాయనే ఆరోపణలు వస్తే.. అధికారుల నిఘా వ్యవస్థ ఏ స్థాయిలో ఉందో చెప్పాల్సిన అవసరం ఉంది.

ఒక్కటి కాదు.. రెండు కాదు.. ప్రతిరోజూ భారీ వాహనాల్లో ఇసుక తరలింపు జరుగుతోందని స్థానికులు చెబుతున్న నేపథ్యంలో అధికారులు ఇప్పటివరకు ఎన్ని టిప్పర్లను తనిఖీ చేశారు? ఎన్ని వాహనాలపై కేసులు పెట్టారు? ఎంత ఇసుకను సీజ్ చేశారు? అన్న వివరాలను ప్రజల ముందుంచాల్సిన సమయం వచ్చింది.

**చెక్‌పోస్ట్ తొలగింపుతో ఎవరికి ప్రయోజనం?**

ఇదే సమయంలో సాలూరా చెక్‌పోస్ట్






తొలగింపు వ్యవహారం కూడా అనుమానాలకు తావిస్తోంది. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన సరిహద్దు ప్రాంతంలో చెక్‌పోస్ట్ తొలగిస్తే.. ఇక వాహనాలను పర్యవేక్షించేది ఎవరు? రాత్రివేళల్లో సరిహద్దు దాటుతున్న భారీ టిప్పర్లపై నిఘా ఎవరిది? చెక్‌పోస్ట్ తొలగింపు వెనుక అధికారిక కారణం ఏమిటి? దీనిపై జిల్లా ఉన్నతాధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలి.

**'మామూళ్ల' ఆరోపణలపై విచారణ ఎప్పుడు?**

అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ స్థానికంగా మామూళ్ల ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇవి నిజమా? కాదా? అన్నది తేల్చాల్సిన బాధ్యత సంబంధిత ఉన్నతాధికారులదే.

ఇంత పెద్ద స్థాయిలో అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలు వస్తున్నప్పుడు అధికారులు ఆకస్మిక తనిఖీలు ఎందుకు నిర్వహించడం లేదు? అనే ప్రశ్న ప్రజల్లో వినిపిస్తోంది.

**రోజుకు రూ.4 లక్షల 'మామూలు' డిమాండ్ ఎవరిది?**

మరోవైపు బోధన్ నియోజకవర్గానికి చెందిన ఓ బడా రాజకీయ నాయకుడి పేరుతో "ఎంత ఇసుకైనా తరలించండి.. రోజుకు రూ.4 లక్షలు ఇవ్వాలి" అంటూ డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికంగా ప్రచారంలో ఉన్నాయి.

ఈ ఆరోపణలు నిజమైతే వ్యవహారం అత్యంత తీవ్రమైనదే. నిజం కాకపోతే సంబంధిత వ్యక్తులు దీనిపై స్పష్టమైన వివరణ ఇవ్వాలి. కేవలం ప్రచారంగా వదిలేయకుండా జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ చేపట్టాలి.

**అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించే ప్రశ్నలు ఇవే!**

రాత్రి 8 గంటల తర్వాత టిప్పర్లు ఎందుకు పెరుగుతున్నాయి? మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి ఇసుక ఎలా వస్తోంది? వాహనాలకు అనుమతులు ఉన్నాయా? ఇసుక రవాణా చలాన్లు, పర్మిట్లు ఉన్నాయా? చెక్‌పోస్ట్‌ను ఎందుకు తొలగించారు? ఇప్పటివరకు ఎన్ని టిప్పర్లపై చర్యలు తీసుకున్నారు? అక్రమ రవాణా జరిగితే ప్రభుత్వానికి ఎంత నష్టం? అధికారుల పర్యవేక్షణ లో లోపం ఉందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు రావాల్సిందే.

**సాలూరా సరిహద్దుపై స్పెషల్ ఆపరేషన్ చేయాలి!**

సాలూరా–-యేస్గి సరిహద్దు మార్గంలో జిల్లా ఉన్నతాధికారులు రాత్రివేళ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి, టిప్పర్ల రాకపోకలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలి. మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలి. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న అక్రమ ఇసుక రవాణా నిజమైతే.. ఎంత పెద్ద వ్యక్తి వెనుక ఉన్నా వదిలిపెట్టకుండా చర్యలు తీసుకోవాలి. సాలూరా చెక్‌పోస్ట్ ఇకనైనా మేల్కొంటుందా? లేక ఇసుక టిప్పర్లకు దారి చూపించే గేటుగా మిగిలిపోతుందా?

**విచారించి ... చర్యలు తీసుకోవాలి**

సాలూరా సరిహద్దులో జరుగుతున్నట్లు వస్తున్న ఇసుక అక్రమ రవాణా ఆరోపణలపై జిల్లా కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులు, మైనింగ్ శాఖ అధికారులు తక్షణమే విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలి.

# ప్రతి తండాకు రోడ్డు



**తండాల ప్రగతే లక్ష్యం**

**గిరిజన సంక్షేమానికి కృషి**

**గిరిజనుల ఆత్మగౌరవం సంక్షేమానికి పెద్దపీట**

**నియోజకవర్గస్థాయి గిరిజనుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

వనపర్తి, అక్షిత ప్రతినిధి : గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి పనిచేస్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గిరిజనుల జీవితాల్లో శాశ్వతమైన మార్పు తీసుకురావడంతో పాటు ప్రతి తండాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. శుక్రవారం వనపర్తి నియోజకవర్గం పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి గిరిజనుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గిరిజనులతో ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గిరిజనులు మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం, ఆత్మగౌరవం కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుండి పోరాడిందని పేర్కొన్నారు. ప్రజల కోసం పనిచేసే ప్రతి ఒక్కరినీ కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ నాయకత్వం గౌరవిస్తుందని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి తండాలో ఇల్లు లేని గిరిజన కుటుంబాలను గుర్తించి ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అర్హత ఉన్న ఏ ఒక్క పేద కుటుంబం కూడా సొంత ఇంటికి దూరం కాకుండా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. వనపర్తి నియోజకవర్గ పరిధిలోని 32 తండా గ్రామపంచాయతీల్లో సేవాలాల్ మహారాజ్ ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. గిరిజనుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవిస్తూ సేవాలాల్ మహారాజ్ గుడుల చేపడతాం అన్నారు. అదేవిధంగా ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి తండాకు రోడ్డు.. ప్రతి తండాకు అభివృద్ధి నియోజకవర్గంలోని ప్రతి తండాకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. తండాల నుంచి మండల, నియోజకవర్గ కేంద్రాలకు రాకపోకలు సులభతరం అయ్యేలా రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రతి గిరిజన గ్రామ పంచాయతీని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. తండాల్లో మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి రంగాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. సాగునీటి సమస్యతో గిరిజన రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని తండాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రైతుల భూములకు నీరు అందితేనే గిరిజన కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని అన్నారు. వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి రూ. 2,000 కోట్లకు పైగా పనులు వనపర్తి నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ. 2,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. రోడ్లు, విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతులు, తాగునీరు, గ్రామీణాభివృద్ధి తదితర రంగాల్లో పెద్దఎత్తున పనులు చేపడుతున్నామని తెలిపారు.

# ఆదర్శ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎమ్మార్వో

### విద్యార్థులకు ప్లేట్లు,గ్లాసులు అందజేత

### విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి..

### చౌటుప్పల్ ఎమ్మార్వో వీరాబాయి

**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని గురువారం చౌటుప్పల్ ఎమ్మార్వో వీరబాయి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. బాలికలకు అందుతున్న వసతి సదుపాయాలను హాస్టల్ వార్డెన్ మల్లికను అడిగి తెలుసుకున్నారు.సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన





ఆహార పదార్థాలను, కూరగాయలను, కిరాణా వస్తువులను పరిశీలించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. హాస్టల్లో విద్యార్థులకు అన్ని వసతులు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకొని గత సంవత్సరపు విద్యార్థుల లాగానే ఈ సంవత్సరం కూడా ప్రథమ,ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాల అధ్యాపకులకు, తల్లిదండ్రులకు, మంచి పేరు తీసుకురావాలని సూచించారు. వసతి గృహ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతి సంవత్సరం విద్యార్థులు మంచి ఫలితాలను సాధించడానికి కృషి చేస్తున్న హాస్టల్ వార్డెన్ మల్లికను ప్రత్యేకంగా ఎమ్మార్వో అభినందించారు. అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చిన ప్లేట్లు,గ్లాసులు,స్పూను, బౌల్ లను ఎమ్మార్వో వీరబాయి విద్యార్థులకు తన చేతుల మీదుగా అందజేశారు. హాస్టల్లో విద్యార్థులకు కావాల్సిన మరిన్ని సదుపాయాలను అందించడానికి తాను కృషి చేస్తానని ఎమ్మార్వో తెలిపారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ మల్లిక, సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# భూ వివాదంతో వ్యక్తిపై దాడి

### మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

### మల్దకల్ ఎస్సై శ్రీ హరి

**మల్దకల్ అక్షిత న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండల పరిధిలోని ఉలిగేపల్లి గ్రామంలో భూ వివాదం కారణంగా ఓ వ్యక్తిపై దాడి జరిగిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరి గురువారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉలిగేపల్లికి చెందిన కురువ నర్సింహులు, అతని బంధువులు కురువ తిరుమలేష్, కురువ నర్సింహులు, కురువ జయన్నల మధ్య కొంతకాలంగా భూ వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి భూ సమస్యపై



మాట్లాడేందుకు ఫిర్యాదుదారుడు కురువ నర్సింహులు, కురువ జయన్న ఇంటికి వెళ్లాడు.

ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య గొడవ జరగడంతో నిందితులు దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అనంతరం కురువ తిరుమలేష్ కర్రతో తలపై, కురువ నర్సింహులు వీపుపై దాడి చేయగా, కురువ జయన్న పిడిగుద్దులతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. దాడిలో గాయపడిన బాధితుడిని అతని భార్య చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరి వెల్లడించారు.

# ప్రయాణికులకు ఆత్మీయత పంచిన ఆర్టీసీ సిబ్బంది..

### రాఖీలు కట్టి రక్షాబంధన్ వేడుకలు

**గద్వాల / అక్షిత న్యూస్:** రక్షాబంధన్ పండుగ సందర్భంగా గద్వాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీ సిబ్బంది వినూత్నంగా వేడుకలను నిర్వహించారు. డిపో మేనేజర్ శ్రీధర్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ మేనేజర్ జి. బాల సరస్వతి, సిబ్బంది పుష్ప, అనూష, రాజ్య సరస్వతి తదితరులు ప్రయాణికులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులతో ఆత్మీయంగా మమేకమై



సోదరభావాన్ని పంచుకున్నారు. రాఖీలు కట్టిన సిబ్బంది సేవా భావాన్ని ప్రయాణికులు అభినందించారు. రక్షాబంధన్ పండుగ సందర్భంగా ప్రయాణికులతో సోదర--సోదరీ భావాన్ని పంచుకోవడం ఆనందంగా ఉందని పలువురు హర్షం వ్యక్తం చేశారు. నిత్యం ప్రయాణికులకు సేవలందించే ఆర్టీసీ సిబ్బంది ఈ విధంగా పండుగ వేడుకలను నిర్వహించడం బస్టాండ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# అన్నా చెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ



**చిలుకూరు, ఆగస్టు 28: (అక్షిత న్యూస్):** అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి, వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. సోదరులు తమ సోదరీమణులకు కానుకలు అందించి ఆప్యాయతను చాటుకున్నారు. రాఖీ పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకచోట చేరి ఆనందంగా వేడుకలు జరుపుకున్నారు. సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, అనుబంధం, ఆత్మీయతను మరింత బలపరిచే పండుగ రాఖీ అని పలువురు పేర్కొన్నారు. వేడుకల్లో పాల్గొన్న వారు ఒకరికొకరు రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.

# సట్లపూర్ తండాలో ఘనంగా గ్రామ సభ....!

### ఓటు హక్కుపై అవగాహన....

### ప్రత్యేక కార్యక్రమాలపై జీపీఓ గంగారాం వివరణ



**ఆర్మూర్, అక్షితప్రతినిధి:** మాక్లూర్ మండలం సట్లపూర్ తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ జీపీఓ గంగారాం మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటు హక్కుపై అవగాహనతో పాటు ప్రభుత్వం చేపడుతున్న వివిధ ప్రత్యేక కార్యక్రమాలపై వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో కీలకమని సూచించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, గ్రామ పంచాయతీ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలపై కూడా చర్చించారు. ఈ గ్రామ సభలో గ్రామ సర్పంచ్ సూర్య ప్రకాశ్, ఉపసర్పంచ్ మహిపాల్, వార్డు సభ్యులు, కారోబార్, జీపీఓ గంగారాం, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఆటియా పాటియా పోటీలకు చిలుకూరు విద్యార్థులు



**చిలుకూరు ఆగస్టు28(అక్షిత న్యూస్):** నిర్మల్‌లో ఈ నెల 29, 30 తేదీలలో నిర్వహించనున్న జూనియర్స్ ఆటియా పాటియా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల చిలుకూరు--సూర్యాపేట విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు.

సూర్యాపేట జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మధు, ఇన్‌చార్జి ఏటీపీ జానీమియా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేస్తూ పోటీలకు పంపించారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని సూర్యాపేట జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పీఈటీలు రాజ్‌కుమార్, మట్టయ్యతో పాటు ఇతర ఉపాధ్యాయులు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

## మహిళా ఉద్యోగుల ఆత్మీయ రాఖీ వేడుకలు

**సోదరభావానికి ప్రతీకగా రాఖీ వేడుకలు**

**జీఎంకు రాఖీలు కట్టిన మహిళా ఉద్యోగులు**



**మందమరి, అక్షిత ప్రతినిధి:** మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా జీఎంకు రాఖీ కట్టడం ఆనందంగా ఉందని మహిళా ఉద్యోగులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ మందమర్రి ఏరియాలోని జీఎం కార్యాలయం, గనులు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా ఉద్యోగులు తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. సోదర భావంతో మహిళా ఉద్యోగుల సంక్షేమం, భద్రతకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. రాఖీ పౌర్ణమి వేడుకలతో కార్యాలయంలో సోదరభావం, ఆత్మీయత వెల్లివిరిసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఎం కార్యాలయ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌తో రాఖీ పౌర్ణమి వేడుకలు

**ఎర్రవల్లి మండల కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహణ**



**అలంపూర్ / అక్షిత న్యూస్ :** అలంపూర్ నియోజకవర్గం లోని ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్‌కు ఎర్రవల్లి కాంగ్రెస్ నాయకురాలు పల్లె నిర్మలా రాజుతో పాటు మండల మహిళా కాంగ్రెస్ నాయకులు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరస్పరం మిఠాయిలు తినిపించుకుంటూ రాఖీ పౌర్ణమి పండుగ సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు. సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ సందర్భంగా మహిళా నాయకులు, కార్యకర్తలు ఆత్మీయంగా శుభాకాంక్షలు పంచుకున్నారు. రాఖీ పౌర్ణమి పండుగ సోదరభావానికి, ప్రేమానుబంధాలకు ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల తిప్పలు....!

**ఆన్‌లైన్‌లో పెట్టిన 10 సెకన్లకే 450 బస్తాలు ఖతం.. రైతులకు అందని ఎరువు!**

**బ్లాక్ మార్కెట్‌లో రూ.650 నుంచి రూ.850 వరకు విక్రయం.. "ఈ యూరియా ఎక్కడి నుంచి వస్తోంది?"**

**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దేగాం సర్పంచ్ ఇట్టేడి లింగారెడ్డి,ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్ పెట్టిన కేవలం 10 సెకన్లలోనే 450 బస్తాలు అయిపోయే పరిస్థితి నెలకొందని తెలిపారు. చదువుకున్న రైతులకే ఆన్‌లైన్ బుకింగ్‌లో ఇబ్బందులు ఎదురవుతుంటే.. చదువు రాని, సాంకేతిక పరిజ్ఞానం లేని రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని పేర్కొన్నారు.

**ఒక్కసారి బుక్ చేసుకున్నా.. మళ్లీ మళ్లీ బుకింగ్?**

ఒక రైతు ఒకసారి యూరియా బుక్ చేసుకున్న తర్వాత కూడా మళ్లీ మళ్లీ బుక్ చేసుకునే అవకాశం ఉండటంతో, కొంతమంది రైతులకే పదేపదే యూరియా అందుతున్న పరిస్థితి ఏర్పడుతోందని ఆరోపించారు. దీంతో అవసరం ఉన్న అనేక మంది రైతులకు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు...




**బ్లాక్ మార్కెట్‌లో రూ.650--రూ.850!**

యూరియా దొరకని రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో బ్లాక్ మార్కెట్‌లో ఒక్క బస్తాకు రూ.650 నుంచి రూ.850 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారని సర్పంచ్ పేర్కొన్నారు.

ప్రభుత్వ ధరకు దొరకాల్సిన యూరియా రైతులకు అందకుండా.. అధిక ధరలకు బయట ఎలా లభిస్తోంది? ఈ యూరియా ఎక్కడి నుంచి వస్తోంది? అనే ప్రశ్నలు ఇప్పుడు రైతుల్లో తీవ్రంగా వినిపిస్తున్నాయి.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలి**

యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని దేగాం సర్పంచ్ కోరారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

"రైతు పంట పండించడానికి ఎరువు కోసం క్యూలో నిలబడాల్సిన పరిస్థితి రావడం బాధాకరం. యూరియా పంపిణీ వ్యవస్థలో ఉన్న లోపాలను వెంటనే సరిచేసి ప్రతి రైతుకూ సమానంగా యూరియా అందేలా చర్యలు తీసుకోవాలి" అని దేగాం సర్పంచ్ కోరారు.

## 24 ఏళ్ల తర్వాత కుమారుడితో ఇంటి ముందు మహిళ ధర్నా

**డీఎన్ఏ పరీక్షకు సిద్ధమన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి**



**గద్వాల / అక్షిత న్యూస్:** గద్వాల పట్టణంలోని భీంనగర్ కాలనీలో 24 ఏళ్ల క్రితం జరిగినట్లు చెబుతున్న ఓ ఘటనకు సంబంధించి వివాదం నెలకొంది. తన కుమారుడికి ఓ వ్యక్తే తండ్రి అని ఆరోపిస్తూ ఓ మహిళ అతని ఇంటి ముందు ధర్నాకు దిగింది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. స్థానికుల సమాచారం.. సుమారు 24 ఏళ్ల క్రితం తాను ఇంటిపనిమనిషిగా పనిచేస్తున్న సమయంలో ఇంటి యజమాని కుమారుడు తనపై అనుచితంగా ప్రవర్తించాడని మహిళ ఆరోపిస్తోంది. ఆ ఘటన కారణంగానే తనకు కుమారుడు జన్మించాడని ఆమె పేర్కొంటోంది. ఇంతకాలం ఈ విషయంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెబుతున్న ఆమె, ప్రస్తుతం తన కుమారుడితో కలిసి వచ్చి న్యాయం చేయాలని కోరుతోంది. అయితే, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి తాను ఎలాంటి తప్పు చేయలేదని పేర్కొన్నట్లు సమాచారం. మధ్యవర్తుల సమక్షంలో ఇరువర్గాల మధ్య చర్చ జరిగినట్లు స్థానికులు తెలిపారు. 24 ఏళ్ల తర్వాత కుమారుడిని తీసుకొచ్చి తానే తండ్రినని ఆరోపిస్తున్నారని, అందుకు ఆధారాలు ఉన్నాయా అని ఆయన ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. అయితే, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి డీఎన్ఏ పరీక్షకు సిద్ధంగా ఉన్నానని తెలిపినట్లు స్థానికులు చెబుతున్నారు. మహిళ ఇంటి ముందు ధర్నా చేయడంతో కాలనీవాసులు అక్కడ ఏం జరుగుతుందోనని ఆసక్తిగా గమనించారు. 24 ఏళ్ల తర్వాత ఈ అంశం వెలుగులోకి రావడంపై స్థానికుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ వ్యవహారంలో వాస్తవాలు శాస్త్రీయ, చట్టపరమైన విచారణ ద్వారానే స్పష్టమయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇరువర్గాలు చట్టబద్ధమైన మార్గంలో ముందుకు వెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు. కాగా, ఈ ఘటనపై అధికారికంగా పోలీసులకు ఫిర్యాదు అందిందా లేదా, తదుపరి చర్యలు ఏమైనా చేపట్టారా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

## ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా రాఖీ

**ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి రాఖీ కట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు**



**గద్వాల / అక్షిత న్యూస్ :** రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా గద్వాలలో ఆత్మీయ అనుబంధం వెల్లివిరిసింది. సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పురస్కరించుకుని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు రాఖీ కట్టారు. రాజకీయాలకు అతీతంగా సోదర భావంతో ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన ఈ సందర్భం ఆత్మీయంగా నిలిచింది. రాఖీ కడుతున్న సమయంలో అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని గుర్తుచేసేలా ప్రేమ, ఆప్యాయతలతో కూడిన వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా రాఖీ కేవలం ఒక దారం మాత్రమే కాదని, ప్రేమ, నమ్మకం, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన బంధమని పేర్కొన్నారు. సోదరుడి క్షేమాన్ని కోరుకుంటూ సోదరి రాఖీ కట్టడం, సోదరి పట్ల తన బాధ్యతను సోదరుడు గుర్తుచేసుకోవడం భారతీయ సంప్రదాయంలో ఎంతో విశిష్టమైనదని తెలిపారు. కాలం మారినా, పరిస్థితులు మారినా సోదర--సోదరీమణుల మధ్య ఉండే ఆత్మీయ బంధానికి ఎలాంటి మార్పు ఉండదన్నారు. కుటుంబ బంధాలు, మానవీయ విలువలను మరింత బలపరిచే పండుగగా రాఖీ పౌర్ణమి నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ, తనకు రాఖీ కట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులకు కృతజ్ఞతలు తెలిపారు. రాఖీ పౌర్ణమి ప్రతి ఒక్కరి జీవితాల్లో ప్రేమ, సంతోషం, సోదరభావాన్ని నింపాలని ఆకాంక్షించారు. సోదరీమణుల ప్రేమాభిమానాలు, ఆశీస్సులు ఎల్లప్పుడూ తమపై ఉండాలని అన్నారు. రాఖీ పండుగ సందర్భంగా జరిగిన ఈ ఆత్మీయ కలయిక స్థానికంగా ప్రత్యేకంగా నిలిచింది. కుటుంబ బంధాలకు, మానవీయ విలువలకు ప్రాధాన్యతనిస్తూ సోదర--సోదరీమణుల అనుబంధాన్ని చాటిచెప్పిన ఈ కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

**సిబ్బందికి అనుగుణంగా ఓపిల సంఖ్య పెరగాలి**

**అల్లంపూర్ అక్షిత న్యూస్:** పలువురు ఉద్యోగులు ఎక్కువగా సెలవులు పెట్టడంపై కలెక్టర్ ఆగ్రహం. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు డాక్టర్లు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శుక్రవారం ఆలంపూర్ చౌరస్తాలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పెద్ద సంఖ్యలో సిబ్బంది పని చేస్తున్నప్పటికీ అనుకున్న స్థాయిలో రోగులు రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇక్కడ సరైన వైద్య సేవలు అందించకుండా కర్నూల్ కు, ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వైద్యాధికారులను హెచ్చరించారు. ఆసుపత్రిలోని పలువురు రోగులను పలకరించి వారి సమస్యలను తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వారికి అందజేస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఇన్ పేషెంట్లను ప్రతి రోజు వారి ఆరోగ్య పరిస్థితిని అనుసరించి తరచూ పరీక్షిస్తూ ఉండాలని,




ఆహారాన్ని మెనూ ప్రకారం అందజేయాలన్నారు. ల్యాబ్ ను తనిఖీ చేసి ప్రతిరోజు వివిధ రకాల పరీక్షలను పక్కాగా చేస్తూ రోగులకు రిపోర్టును సకాలంలో అందజేయాలని ఆదేశించారు. గైనిక్, యూఎస్ జీ, ఫార్మసీ, ఈసీజీ, తదితర విభాగాలను సందర్శించి అక్కడి సిబ్బంది పనితీరును గమనించారు. హాజరు రిజిస్టర్ తో పాటు పలు రికార్డులను తనిఖీ చేశారు.



**సిబ్బంది ఎక్కువగా సెలవులు పెట్టడంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం**

కొంతమంది సిబ్బంది ఎక్కువగా సెలవులు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సరైన పనితీరు కనబరచకుంటే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్ద ఎత్తున పారిశుద్ధ్య సిబ్బంది పనిచేస్తున్నందున ఆసుపత్రినీ శుభ్రంగా ఉంచాలని, పరిసరాల్లోని పొదలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. బయో మెడికల్ వేస్టేజీ నిర్వహణకు ఏజెన్సీని నియమించాలని సూచించారు.

పిఈ సందర్భంగా ఆసుపత్రి ప్రహరీ కొంత భాగం కూలిపోవడాన్ని గమనించిన కలెక్టర్ మరమ్మత్తులు చేయిస్తామని పేర్కొన్నారు.

ఈ పర్యటనలో ఆసుపత్రి పర్యవేక్షకులు సయ్యద్ పాషా, ఉండవెల్లి మండల తహసిల్దారు ధరణి షా, తదితరులున్నారు.

# వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులకు పంటల సాగుపై నిరంతరం అవగాహన కల్పిస్తూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సరైన సూచనలు, సలహాలు అందించాలని అన్నారు.

శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ నుంచి వ్యవసాయ శాఖ అధికారులతో ఎల్‌నినో పరిస్థితులు, వాతావరణ మార్పులు, వర్షపాతం, పంటల సాగు, పంటల ప్రస్తుత పరిస్థితి తదితర అంశాలపై అదనపు కలెక్టర్ వెబెక్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, ఇప్పటివరకు నమోదైన వర్షపాతం, మండలాల వారీగా వివిధ పంటల సాగు, పంటల ప్రస్తుత పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు,





ఎరువులు, పురుగుమందులు తదితర వ్యవసాయ ఇన్‌పుట్‌ల లభ్యత, సరఫరా పరిస్థితిపై కూడా సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని మధుసూదన్ నాయక్ సూచించారు. మండలాల వారీగా పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి, రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, సలహాలను సకాలంలో అందించాలని ఆదేశించారు. వాతావరణ మార్పులు, వాటి ప్రభావాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతుల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని, అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్‌లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సంరక్షణకు అవసరమైన చర్యలను చేపట్టాలని ఆదేశించారు.

ఎల్‌నినో పరిస్థితుల కారణంగా వ్యవసాయ కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం పడకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద నాయక్, మండల వ్యవసాయ అధికారులు వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముష్టిపల్లిలో ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు

**లబ్ధిదారులకు పట్టు వస్త్రాలు అందించిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్**



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి 27 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, అందులో భాగంగా నేడు ముచ్చపోతు చెన్నమ్మ–తిరుపతయ్య, పల్లెముని సునీత–శేఖర్ నూతన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, మాజీ ఎంపీటీసీ తలారి ఖాజా, గాదరి చంద్రశేఖర్, టి. శ్రీనివాసులు ఆహ్వానం మేరకు పెద్దకొత్తపల్లి మండల మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామ నాయకులు తమ గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పీసీసీ సభ్యులు చింతలపల్లి జగదీశ్వర్ రావు మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ రిబ్బన్ కట్ చేసి నూతన ఇండ్లను ప్రారంభించారు. అనంతరం సత్యనారాయణ వ్రతంలో పాల్గొని, కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన గృహప్రవేశం చేసిన కుటుంబ సభ్యులకు పట్టు వస్త్రాలు సమర్పించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వి. సత్యం, సర్పంచ్ లాలి బాలు నాయక్, మాజీ సర్పంచ్ పగడాల చిన్నయ్య, మాజీ తలారి ఖాజా వెంకట్ స్వామి గౌడ్, డి. రవికుమార్, ఉప సర్పంచ్ బై రాముడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ గాదరి చంద్రశేఖర్, టి. శ్రీనివాసులు, సైదులు, నరసింహ, పి. మల్లేష్, సత్యనారాయణ, షాకుల నారాయణ, తిరుపతయ్య తదితర నాయకులు పాల్గొని నూతన గృహప్రవేశం చేసుకున్న కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# చలో సెక్రటేరియట్ ముట్టడికి మాలలు తరలిరావాలి

**కూచిమల్ల నాగేష్,మాల మహానాడు మండల అధ్యక్షులు**



**యాదాద్రి భువనగిరి అక్షిత బ్యూరో:** వలిగొండ మండల కేంద్రంలో మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశానికి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మాలలకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేయడానికి చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ మాట్లాడుతూ మాలలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నివారించేందుకు రోస్టర్ విధానాన్ని సవరించాలని జాతీయ మాల మహానాడు పిలుపుమేరకు ఆగస్టు 31న నిర్వహించే చలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి మండలంలోని ప్రతి గ్రామం నుండి మాల విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు పెద్ద సంఖ్యలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా నాయకులు రాపోలు పవన్ కుమార్, మండల ఉపాధ్యక్షులు పుర్మ అంజయ్య, సహాయ కార్యదర్శి కట్ట సురేష్, దాసరి లింగస్వామి, రాపోలు కృష్ణ, రాపోలు మూర్తి, రామలింగం, రాపోలు రమేష్, కేతం ఇంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక



## మదన్‌పల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ...!

**లబ్ధిదారుల చేతికి కొత్త కార్డులు....**

**ప్రభుత్వ సంక్షేమానికి మరో ముందడుగు**



**నిజామాబాద్,అక్షిత ప్రతినిధి:** తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మాక్లూర్ మండలం మదన్‌పల్లి గ్రామంలో గురువారం నిర్వహించారు. గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాస లావణ్య, ఉప సర్పంచ్ రాస మహేష్, జీపీఓ గంగారాం పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత పారదర్శకంగా, సులభంగా ప్రభుత్వ సేవలు అందే అవకాశం ఉందని తెలిపారు.

కార్డులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్,ఎమ్మెల్యే పద్మావతిలపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు



**కోదాడ అక్షిత ప్రతినిధి:** రెండు నియోజకవర్గాల అభివృద్ధియే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలపై లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో హెచ్చరించారు.శుక్రవారం వార్డు కౌన్సిలర్ పాశం శ్రీను నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు.బిఆర్ఎస్ కార్యకర్త మాదాల ఉపేందర్ గతంలో కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓడిపోయారని, ఆయన స్థాయి ఏంటో తెలుసుకొని మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిలపై విమర్శలు చేయాలని హితవు పలికారు.

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం,అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ఏవైనా సందేహాలు ఉంటే బాధ్యతాయుతంగా ప్రశ్నించాలే తప్ప,స్వార్థ రాజకీయాల కోసం వ్యక్తిగత ఆరోపణలకు దిగడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కోదాడ నియోజకవర్గంలో సాగించిన దందాలు, అక్రమాలపై తీవ్ర స్థాయిలో ప్రజల్లో వ్యతిరేకత రావడం వల్లే బిఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించి ఓడించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు.నాయకులు ఇప్పటికైనా హద్దుమీరి మాట్లాడటం మానుకోకపోతే తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో నాయకులు ఈదుల కృష్ణయ్య, కట్టబోయిన శ్రీనివాస యాదవ్, గుండెల సూర్యనారాయణ యాదవ్, మోడెం సైదుబాబు, కోట హరీష్, చీదెళ్ల హనుమంతరావు,యలగందుల శ్రీను, చింతలపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటుపై నిర్లక్ష్యం వద్దు....!



**విచారణకు తప్పక రండి!**

**హాజరుకాకపోతే ఓటు హక్కుపై ప్రభావం...**

**బోధన్ ఆర్డీఓ విజయకుమారి**

**ఎస్ఐఆర్--2026 ప్రత్యక్ష విచారణ ప్రక్రియను పరిశీలించిన ఆర్డీఓ**

**బోధన్, అక్షిత ప్రతినిధి:** ఓటరు జాబితాలో తమ పేరు ఉందని నిర్లక్ష్యం చేయొద్దు.. ఎస్ఐఆర్--2026లో భాగంగా నోటీసులు అందిన ప్రతి ఓటరు ప్రత్యక్ష విచారణకు హాజరై తమ వివరాలను ధ్రువీకరించుకోవాలని బోధన్ ఆర్డీఓ ఎం. విజయకుమారి సూచించారు. విచారణకు హాజరుకాకపోతే ఓటు హక్కుపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు.

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొనసాగుతున్న ఎస్ఐఆర్--2026 ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యక్ష విచారణను ఆర్డీఓ విజయకుమారి పరిశీలించారు. బోధన్ పట్టణంలోని గంజ్ రోడ్డులోని 61వ పోలింగ్ కేంద్రం వద్ద తహసీల్దార్ విట్టల్‌తో కలిసి ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం బోధన్ మండలం ఖండ్గావ్‌లోని 1వ పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీఓతో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో నమోదైన ఓటర్ల వివరాలను పరిశీలించడంతో పాటు, విచారణకు హాజరైన వారి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా విచారణ నిర్వహించాలని అధికారులకు సూచించారు.

నోటీసులు అందిన వారు విచారణను తేలికగా తీసుకోవద్దు. నిర్దేశిత తేదీలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలి. లేకపోతే ఓటు హక్కు రద్దయ్యే అవకాశం ఉంది" అని ఆర్డీఓ విజయకుమారి స్పష్టం చేశారు.

ఓటర్లు తమకు అందిన నోటీసులను పరిశీలించి, గడువులోగా విచారణ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కును కాపాడుకోవడంలో ప్రతి ఓటరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## చెంజర్లలో ట్రాక్టర్‌పై మగ్గం నేత

**రాఖీ పౌర్ణమి వేళ పద్మశాలీల సంప్రదాయ కార్యక్రమం**



**మానకొండూర్ అక్షిత న్యూస్:** రాఖీ పౌర్ణమి సందర్భంగా పద్మశాలీలు నిర్వహించే సంప్రదాయ ఆచారంలో భాగంగా ట్రాక్టర్‌పై మగ్గం నేత కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పద్మశాలీల వృత్తి, సంప్రదాయానికి ప్రతీకగా మగ్గాన్ని ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసి నేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీలు సంప్రదాయ వస్త్రాలు, కండువాలు ధరించి మగ్గం నేసే కార్యక్రమాన్ని చేపట్టారు. తమ కులవృత్తి, చేనేత సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ కార్యక్రమం గ్రామంలోని ప్రధాన పేదలకుండా గుట్టపై వెలసిన శివాలయం వరకు సాగింది. ట్రాక్టర్ పై అమర్చిన మగ్గంతో నేచిన వస్త్రాలను గ్రామంలోని హనుమాన్ గుడి, శివాలయం, గుట్ట శివాలయం లో దేవతా మూర్తులకు సమర్పించారు.

కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్లెన కొమరమ్మ కొమురయ్య, ఉప సర్పంచ్ గడ్డి గణేష్, వార్డు సభ్యులు పద్మశాలి సంఘం నాయకులు ఎలగం రాజయ్య, భైరి వెంకటయ్య, ఎల్లయ్య రమేష్, రాములు, ఒడ్నాల ఓదెలు,సదానందం మార్కండేయ,బొలబత్తుల ఆంజనేయులు,రాజు, గంగుల వెంకటేశ్వర్లు, వాసాల తిరుపతి, బాసబత్తుల వివేక్,రాజేశం, సంపత్,శ్రీరాముల భూమయ్య,నర్సయ్య,ఆడెపు కుమార్, సంపత్,రాజు,లక్ష్మీరాజం,దాసరి కొమురెల్లి, పనస సంపత్, రామ్మూర్తి, సుధాకర్,చంద్రాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్ గోపాల్ రెడ్డి నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధం, పరస్పర విశ్వాసానికి ప్రతీక అయిన రాఖీ పండుగను మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి నివాసం హైదరాబాద్ లో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు.

తన నలుగురు సోదరీమణులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి కి రాఖీలు కట్టి వారిని ఆశీర్వదించారు. తన అక్కల కుటుంభ సభ్యులతో సంప్రదాయబద్దంగా జరుపుకున్న రాఖి పండుగలో తన మనుమరాలు వాన్యతో పాటు కలిసి రాఖీ కట్టించుకున్నారు.

అనంతరం మునుగోడు నియోజకవర్గంతో పాటు వివిధ నియోజకవర్గాల నుండి వచ్చిన సోదరీమణులు రాజ్ గోపాల్ రెడ్డి కి రాఖీ కట్టి ఆశీర్వదించారు.

కుటుంబ వ్యవస్థకు, భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు రాఖీ పౌర్ణమి ఎంతో ప్రాధాన్యత కలిగిన పండుగని, సోదరులు తమ సోదరీమణుల రక్షణ, గౌరవం, భద్రతకు ఎల్లప్పుడూ అండగా నిలవాలని, సోదరీమణులు తమ కుటుంబాల్లో ప్రేమానురాగాలను మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.

ఈ రాఖీ పౌర్ణమి ప్రతి కుటుంబంలో సంతోషం, శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఆకాంక్షిస్తూ.మునుగోడు నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్ర ఆడపడుచులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**



**మందమరి, అక్షిత ప్రతినిధి:** ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ, వారి అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాసిపేట మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, వంటశాల, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించి బోధన, తరగతుల నిర్వహణ, వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధన అందించాలని, వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని సోనాపూర్ గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ విచారణలను పరిశీలించి ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో బెల్లంపల్లి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో, నాబార్డ్, సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ సహకారంతో నిర్వహిస్తున్న పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడం, అగ్రో ఫారెస్ట్రీ ప్రాజెక్టులో భాగంగా కోలాం గిరిజన కుటుంబాలకు మామిడి, ఉసిరి, పనస, జామ, బొప్పాయి తదితర పండ్ల మొక్కలను ఉచితంగా అందజేశారు. ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు కుటుంబాలకు పౌష్టికాహారం, భవిష్యత్తులో అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామస్థులతో మాట్లాడి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షించి పనులు వేగవంతం చేయాలని, గిరిజన ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి అనిత, తహసీల్దార్ సునీల్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్, మండల పంచాయతీ అధికారి సఫ్దర్ అలీ, మండల విద్యాధికారి, ఎఫ్‌పిసి ఛైర్మన్ ఎంబడి కిషన్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, సర్పంచ్‌లు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో భారీగా గంజాయి పట్టివేత

**20.360 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**ఇద్దరు నిందితుల అరెస్ట్, వాహనం, చరవాణిలు స్వాధీనం...**

**ఒడిస్సా రాష్ట్రం నుండి తెలంగాణకు గంజాయి తరలింపు....**

**చౌటుప్పల్ సిఐ జి మన్మధ కుమార్**




**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ నేషనల్ హైవే- 65 హైదరాబాద్ రోడ్డులోని ఎలక్ట్రికల్ ఎలక్ట్రిక్ సబ్ స్టేషన్ సమీపంలో చౌటుప్పల్ పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. సిఐ జి.మన్మధ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. చౌటుప్పల్ డి.ఎస్.పి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు, సీఐ జి. మన్మధ కుమార్ ఆధ్వర్యంలో, ఈగల్ ఫోర్స్ సహకారంతో పోలీసులు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుండి 20.360 కిలోల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఈనెల 27వ తేదీ గురువారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్. కృష్ణమాల్ కి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో కలిసి గురువారం రాత్రి నేషనల్ హైవే-65 హైదరాబాద్ రోడ్డులోని చౌటుప్పల్ ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టారు.

ఈ క్రమంలో ఓడి 02డిఎస్ 897 నంబర్ గల కారును అనుమానంతో ఆపి తనిఖీ చేయగా, వాహనం వెనుక డిక్కీలో బ్రౌన్ టేపుతో చుట్టిన ప్యాకెట్లను పోలీసులు గుర్తించినట్లు తెలిపారు.వాటిని పరిశీలించగా గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

మొత్తం 20 ప్యాకెట్లలో 20.360 కిలోల గంజాయి ఉన్నట్లు తూకం వేయగా నిర్ధారణ అయిందన్నారు.గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుల వద్ద ఉన్న మూడు మొబైల్ ఫోన్లు, గంజాయి తరలించేందుకు ఉపయోగించిన కారును పోలీసులు సీజ్ చేయడం జరిగిందన్నారు.

ఈ కేసులో ఏ -1 త్రిలోచన్ సామంత్రా( 30 ) రాజ్‌నగర్ గ్రామం, కేంద్రపారా జిల్లా, ఒడిశా రాష్ట్రం,ఏ -2 సాగర్‌బాల్ (23) రాజ్‌నగర్, కేంద్రపారా జిల్లా, ఒడిశా రాష్ట్రంకు చెందిన వ్యక్తులుగా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నార్నారు.

పోలీసుల విచారణలో ఒడిశా రాష్ట్రం నుండి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి తెలంగాణలో అధిక ధరకు విక్రయించేందుకు అక్రమంగా తరలిస్తున్నట్లు వెల్లడైందన్నారు.గంజాయి తరలింపునకు నిందితులకు రూ.50,000/- ఇస్తామని ఆఫర్ చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు.

ఈ గంజాయి అక్రమ రవాణాలో మరికొందరు వ్యక్తుల ప్రమేయంపై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి, మొబైల్ ఫోన్లు, వాహనాన్ని తదుపరి చట్టపరమైన చర్యల కోసం భద్రపరిచమన్నారు.నిందితులపై ఎండిపిఎస్ ఆక్ట్ కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్ కు తరలించడం జరిగిందన్నారు. గంజాయిని చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను డీఎస్పీ పి. మధుసూదన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## పేద ప్రజలకు సుదీర్ఘ వైద్యసేవలు అందించిన చిరస్మరణీయుడు డాక్టర్.చల్మారెడ్డి

**డాక్టర్ చల్మారెడ్డి మృతి తనను తీవ్రంగా కలచివేసింది**

**మాజీ ఎమ్మెల్యే,మాజీ ఎం.పి రావుల.చంద్రశేఖర్ రెడ్డి**



**వనపర్తి అక్షిత ప్రతినిధి:** పేద ప్రజలకు సుదీర్ఘ వైద్యసేవలు అందించిన చిరస్మరణీయుడు డాక్టర్.చల్మారెడ్డి అని, డాక్టర్ చల్మారెడ్డి మృతి తనను తీవ్రంగా కలచివేసిందని మాజీ ఎమ్మెల్యే, మాజీ పార్లమెంట్ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఇటీవల మరణించిన డాక్టర్ చల్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి సతీమణి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రావుల మాట్లాడుతు వనపర్తి ప్రజలకు సుదీర్ఘ వైద్యసేవలు అందించిన డాక్టర్.చల్మారెడ్డి చిరస్మరణీయుడని రావుల అన్నారు.చల్మారెడ్డి తనకు శ్రేయోభిలాషి అత్యంత ఆత్మీయుడని వారిని కోల్పోవడం దురదృష్టకరం అన్నారు. రావుల వెంట జిల్లా వాకిటి శ్రీధర్ పలుస రమేష్ గౌడ్ నందిమల్ల అశోక్,ఉంగ్లం. తిరుమల్,నాగన్న యాదవ్,కె.రమేష్ చంద్ర,ధర్మా నాయక్, నందిమల్ల. రమేష్, యాదయ్య,బాలయ్య ఉన్నారు.

**పలువురిని పరామర్శించిన మాజీ ఎం.పి రావుల**

మాజీ కౌన్సిలర్ సమద్ మాతృమూర్తి రెహమాన్ బేగం మృతి చెందిన విషయం తెలిసిన రావుల పార్థీవ దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని కోరారు. అదేవిధంగా చెన్నూరు బి.ఆర్.ఎస్ నాయకులు నారాయణ రావు మాతృమూర్తి మరణించిన విషయం తెలిసి ఇంటికి వెళ్ళి నారాయణ రావు కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## అన్నచెల్లెళ్ళ అనురాగానికి రక్షాబంధన్



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** అన్నాచెల్లెళ్ళ, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, ఆత్మీయతకు ప్రతీక రక్షాబంధన్, వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలో అన్నచెల్లెల్లు రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ పవిత్రమైన రోజున సోదరి తన సోదరుడి చేతికి రాఖీ కట్టి, అతని సుఖసంతోషాలను కోరుకుంటుంది. సోదరుడు తన సోదరి పట్ల ప్రేమ, గౌరవం, అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేస్తాడు. రాఖీ అనే పవిత్రమైన దారం కేవలం ఒక బంధానికి గుర్తు మాత్రమే కాదు, కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలిచే ఆత్మీయతకు, కుటుంబ అనుబంధాలకు ప్రతీక. ఈ రక్షాబంధన్ సందర్భంగా ప్రతి సోదర--సోదరీమణుల జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, శాంతి, సుఖసంతోషాలు నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ తన అన్నకు రాఖీ కడుతున్న చెల్లి,

# కొత్త పింఛన్లకు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

**అర్హులందరికీ చేయూత పథకం ప్రయోజనం అందాలి**

**అదనపు కలెక్టర్ పాండు**



సంగారెడ్డి అక్షిత బ్యూరో: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకం--2026 కింద అర్హులైన వారికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ పాండు తెలిపారు. కొత్తగా పింఛన్ పొందేందుకు అర్హత ఉన్న వారు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలను శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పాండు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జానకిరెడ్డి, డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యారావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం చేయూత సామాజిక భద్రత పింఛన్లు అందిస్తోందన్నారు. కొత్తగా పింఛన్ పొందేందుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ నిర్దేశిత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హతలు ఇలా.. వితంతువులు: 18 సంవత్సరాలు పైబడిన వారు, భర్త మరణ ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి. ఒంటరి మహిళలు: 18 సంవత్సరాలు పైబడిన వారు, భర్తతో విడిపోయి లేదా భర్త వదిలివేసి కనీసం ఏడాది పూర్తయిన వారు అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లో 30 సంవత్సరాలు, పట్టణ ప్రాంతాల్లో 35 సంవత్సరాలు పైబడిన అవివాహిత మహిళలు కూడా అర్హులని తెలిపారు. దివ్యాంగులు: వయస్సుతో సంబంధం లేకుండా అర్హత ఉంటుంది. సదరం లేదా యూడీఐడీ ధ్రువీకరణ ద్వారా కనీసం 40 శాతం వైకల్యం ఉన్నవారు అర్హులు. వినికిడి లోపం ఉన్నవారికి 51 శాతం వైకల్యం ఉండాలని తెలిపారు. రక్త సంబంధిత దివ్యాంగులు: తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధి, హీమోఫీలియాతో బాధపడుతున్న వారు అర్హులు. సదరం లేదా యూడీఐడీ ధ్రువీకరణ తప్పనిసరిగా ఉండాలి. కల్లుగీత కార్మికులు: 50 సంవత్సరాలు పైబడిన వారు, కల్లుగీత కార్మికుల సహకార సంఘంలో సభ్యత్వం కలిగి ఉండాలి. ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ అవసరం. చేనేత కార్మికులు: 50 సంవత్సరాలు పైబడిన వారు అర్హులు. చేనేత, జౌళి శాఖ ధ్రువీకరణ ఉండాలి. ఫైలేరియా బాధితులు: గ్రేడ్--2, గ్రేడ్--3 ఫైలేరియా వ్యాధిగ్రస్తులు అర్హులు. అధికారుల వద్ద దరఖాస్తుల స్వీకరణ గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు, పురపాలక కమిషనర్లు దరఖాస్తులను స్వీకరిస్తారని అదనపు కలెక్టర్ తెలిపారు. దరఖాస్తు ఫారాలను చేయూత తెలంగాణ అధికారిక వెబ్‌సైట్‌లోని విభాగం నుంచి పొందవచ్చని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి వితంతువు, ఒంటరి మహిళ దరఖాస్తు చేసుకునేలా మహిళా సమాఖ్యల సహకారంతో దరఖాస్తు ప్రక్రియతో పాటు అవసరమైన ధ్రువపత్రాల విషయంలో సహాయం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పథకం ప్రయోజనం అందేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కొత్త పింఛన్లకు అర్హులైన వారు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ పాండు కోరారు.

## శిశుగృహంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు..

**చిన్నారులతో రాఖీలు కట్టించుకున్న జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి**



కరీంనగర్ అక్షిత బ్యూరో: కరీంనగర్ శిశు గృహంలోని చిన్నారులతో కలిసి జిల్లా సంక్షేమ అధికారి మార్త సరస్వతి శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులకు రాఖీలు కట్టించి, వారికి స్వయంగా మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మ ప్రేమకు దూరంగా ఉన్న శిశుగృహ పిల్లల ముఖాల్లో చిరునవ్వులు చిందించేలా సాగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి రాకతో పిల్లలంతా ఎంతో ఆనందంగా, సందడి చేస్తూ పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ వాత్సల్య ప్రొటెక్షన్ ఆఫీసర్ పూదరి శాంత, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది సుందరగిరి సాయికిరణ్ గౌడ్, శిశుగృహ ఏఎన్ఎం మెట్టు రమాదేవి, కౌన్సిలర్ కీర్తి, శిశుగృహ ఆయాలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాఖీ పండుగ శుభాకాంక్షలు

**యూనియన్ అధ్యక్షులు మహబూబ్ అలీ**



నాగర్కర్నూల్ అక్షిత ప్రతినిధి: జిల్లాలోని అచ్చంపేట నియోజక వర్గంలో రాఖీ పండుగ సందర్భంగా పంద్ల బండి బక్కమ్మ అక్క ప్రేమ అనురాగాలతో ఆటో కార్మికులు కార్మికులకు రాఖీ పండుగ సందర్భంగా రాఖీ కట్టడం జరిగినది ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు మహబూబ్ అలీ మాట్లాడుతూ అక్క గత పది సంవత్సరాల నుండి తోటి తమ్ముళ్ల లాగా తమ్ముళ్లను మరువకూడదు ప్రతి సంవత్సరం రాఖీ బంధన్ కట్టడం జరుగుతుంది అక్కకు శుభాకాంక్షలు చెబుతూ ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు మహబూబ్ అలీ గౌరవ అధ్యక్షులు అశు యూనియన్ ఉపాధ్యక్షులు వెంకటేష్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కాజామియ యూనియన్ సీనియర్ నాయకులు శ్రీనివాసచారి మరియు యూనియన్ సభ్యులందరూ పాల్గొని బక్కమ్మ అక్కకు శుభాకాంక్షలు తెలపడం జరిగినది.

## అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ

**వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి**



చౌటుప్పల్ /అక్షిత న్యూస్: అన్నా చెల్లెల మధ్య ప్రేమానురాగాలకు,ఆత్మీయతకు ప్రత్యేకంగా నిలిచే రాఖీ పండుగను శుక్రవారం చౌటుప్పల్ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ప్రతినిధి పెద్దగోని మౌనిక రాఖీ పండుగను పురస్కరించుకొని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డికి వారి నివాసంలో రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి మిఠాయిలు తినిపించి, దీర్ఘాయుష్మగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆకుల ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. "రాఖీ పండుగ అనేది అన్నా చెల్లెళ్ల అనుబంధానికి, ప్రేమ ఆప్యాయతలకు ప్రతీక అని ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఖరీఫ్ పంటలకు సాగునీరు

**సర్పంచుల ఆధ్వర్యంలో కాలువ మరమ్మత్తులు**

**నల్లమల్ల గ్రామాల రైతులకు సాగునీరు విడుదల**



కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి: పెద్దకొత్తపల్లి మండలం: నల్లమల్ల గ్రామాల రైతుల వ్యవసాయ పొలాలకు సాగునీరు అందించేందుకు ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలతో పెద్దూరు వద్ద కేఎల్ఐ కాలువకు మరమ్మత్తులు చేసి నీటిని విడుదల చేశారు. పెద్దకొత్తపల్లి మండలంలోని నల్లమల్ల గ్రామాలైన చిన్న కొత్తపల్లి, పాత యాపట్ల, కొత్త యాపట్ల, చంద్రబండ తండా, మారేడుమాన్ దిన్నె గ్రామాల వ్యవసాయ రైతులకు వారి పంటలకు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాలువ ద్వారా వచ్చే సాగునీటిని విడుదల చేయడం కోసం ఆయా గ్రామాల సర్పంచులు పాత్లావత్ లాలి బాలు నాయక్, ఏదుల జంగమ్మ, కృష్ణ గౌడ్, కేతావత్ శంకర్ నాయక్, యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు యాపట్ల మాజీ సర్పంచ్ రమేష్ రావు, మాజీ ఎంపిటిసి వెంకటస్వామి గౌడ్, జీకే రమేష్ ఆధ్వర్యంలో మరమ్మత్తులు చేపట్టారు. తెల్లపల్లి మండలంలోని పెద్దూరు గ్రామ సమీపంలో ఉన్న ప్రధాన కాలువ నుండి అక్కడ ఉన్న కాలువ గేటును ఎత్తి క్రింద ఉన్న నల్లమల్ల గ్రామాలకు నీటిని విడుదల చేయడం కోసం ఆయా గ్రామాల సర్పంచుల, నాయకుల కృషితో నీటి విడుదల చేపట్టారు. అలాగే ఆ కాలువకు ఇరువైపులా ఉన్న రైతుల పొలాల్లో కాలువ నీరు వెళ్లకుండా రెండు పెద్ద గుంతలను ఏర్పాటు చేసి, జేసీబీ సహాయంతో కాలువలో ఉన్న పూడికను తొలగించి క్రింది గ్రామాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో నల్లమల్ల గ్రామాల రైతుల వ్యవసాయ పొలాలకు ఈ ఖరీఫ్ సీజన్ లో పంటలకు సాగునీరు అందించేందుకు కృషి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలపీరు బాలు నాయక్, గేమ్యా నాయక్, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిడ్జ్‌లో ఆనందోత్సవాలతో రక్షాబంధన్

**వెల్లివిరిసిన ఆత్మీయ సోదర సోదరీమణుల ప్రేమ**



ఖమ్మం/అక్షిత బ్యూరో : సోదర సోదరీమణుల ఆత్మీయ అనుబంధాలకు ప్రతీకగా నిలిచిన రక్షాబంధన్ వేడుకలను శుక్రవారం స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఆనందోత్సవాలతో నిర్వహించారు. ప్రతి తరగతిలో పాఠశాల విద్యార్థులకు బాలికలు రక్షణ కట్టి తమ అనుబంధాన్ని చాటారు. బాలుర ముంజేతికి రక్షాబంధన్ కట్టి బాలికలు వారికి మిఠాయిలు తినిపించి ఆప్యాయతను చాటారు. విద్యార్థులందరిలో సోదర ప్రేమ వెల్లి విరిసింది. రాఖీలు కడుతున్నంతసేపు బాలుర ముఖాలలో ఆనందం వెల్లివిరిసింది. అదేవిధంగా పాఠశాల పరిసర ప్రాంతాలలోని చెట్లకు విద్యార్థులు రాఖీలు కట్టి తమ వృక్ష బంధాన్ని తెలియజేశారు. దీనితో పాటు పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు వాచ్మెన్ డ్రైవర్స్ తమ ఫోటోలు ఎల్లప్పుడూ తీస్తున్న ఫోటోగ్రాఫర్స్ కు పాఠశాల విద్యార్థులు రాఖీలు కట్టడం ప్రత్యేకతను సంతరించుకుంది.

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ విద్యార్థులలో సహోదర ప్రేమ విలువను తెలియజేసేందుకు రక్షాబంధన్ వేడుకలను పాఠశాలలో నిర్వహిస్తున్నామని తెలియజేశారు. అన్నాచెల్లెళ్ల అనుబంధం జీవితాంతం నిలిచే ఒక మధురమైన బంధం చేతికి కట్టే రాఖీ ఒక దారం మాత్రమే కాదు.

ప్రేమకు నమ్మకానికి ఆప్యాయతకు ప్రతీక అని పురాణాల కాలం నుండి ప్రత్యేకంగా మన దేశంలోని అన్ని ప్రాంతాలలో రక్షాబంధన్ వేడుకలకు మహోన్నత స్థానం ఉందని పేర్కొన్నారు.తోడబుట్టిన సోదరులకే కాకుండా ఇతరులను సోదరులుగా భావించి రాఖీలు కట్టే సంప్రదాయం మనదేశానికే సొంతం అని తెలియజేశారు.

రాఖీ పర్వదినం ప్రజలందరిలో అనురాగ ఆప్యాయతలను ఐకమత్యాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.